

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL  ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి  ఆదివారం 11-09-2022  సంపుటి : 04  సంచిక : 22  పేజీలు : 4  వెల : రూ 3-00

# అతి త్వరలోనే మూడు రాజధానుల బిల్లు..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మళ్లీ రాజధానులపై రగడ మొదలైంది. అమరావతినే రాజధానిగా ప్రకటించాలంటూ అక్కడి రైతులు గతంలో తిరుపతి వేంకటేశ్వరుని సన్నిధి వరకు పాదయాత్ర సాగించగా.. ఇప్పుడు అరసవల్లి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. పాదయాత్ర చేస్తే శాంతి భద్రతల విఘాతం కలుగుతుందని ఏపీ డీజీపీ అనుమతి నిరాకరించగా.. వెంటనే అనుమతి ఇవ్వాల్సిందేనని హైకోర్టు తీర్పునిచ్చింది. దాంతో సెప్టెంబర్ 12 నుంచి అమరావతి రైతుల మహాపాదయాత్రకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అమరావతి రైతుల మహా పాదయాత్ర నేపథ్యంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విలేకర్ల సమావేశం నిర్వహించి మూడు రాజధానుల బిల్లుపై స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాజధాని బిల్లుపై కొన్ని అభ్యంతరాలు వచ్చాయని, ఈ కారణంగానే ఉపసంహరించుకున్నామని.. కానీ, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో మరోసారి మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని మంత్రి వివరించారు. బిల్లు ప్రవేశపెట్టిన తర్వాత ఏరోజు నుంచైనా పాలన సాగిస్తారంటూ గుడివాడ అమర్‌నాథ్ స్పష్టం చేశారు. మరోవైపు చంద్రబాబు నాయుడుపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. రాజధాని అమరావతి పేరుతో విశాఖపై దండయాత్ర చేస్తామంటే ఉత్తరాంధ్ర ప్రజలు ఊరుకోరంటూ దుయ్యబట్టారు.

విశాఖకు ఎప్పుడైనా వైఎస్ జగన్..!

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో మూడు రాజధానుల బిల్లు

బిల్లు పెట్టిన తర్వాత ఎప్పుడైనా సీఎం వైజాగ్ రావొచ్చు

చంద్రబాబే అమరావతి రైతులతో ఉద్యమం చేయిస్తున్నారు

ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు దెబ్బతీయొద్దు: మంత్రి అమర్‌నాథ్

అమరావతి రైతులు పాదయాత్ర చేస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని, దానికి పూర్తి బాధ్యత చంద్రబాబు నాయుడే వహించాలని పేర్కొన్నారు. మూడు రాజధానులతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని.. దీన్ని వ్యతిరేకిస్తున్న చంద్రబాబే అమరావతి రైతులతో ఉద్యమం చేయిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుతో పాటు సీపీఐ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకంగా గతంలో పుస్తకావిష్కరణ సభలో మాట్లాడారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు డైరెక్షన్‌లో అమరావతి టు అరసవెల్లి పాదయాత్ర చేపట్టారని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతోనే ఆ యాత్రకు పోలీసులు అనుమతులు నిరాకరించారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే విధంగా చేసే పాదయాత్రను ఉత్తరాంధ్ర ప్రజలు హర్షించరని, పాదయాత్ర పేరుతో దండయాత్ర చేస్తే జనం చూస్తూ ఊరుకోరన్నారు. మూడు రాజధానులు ఏర్పాటు చేసి తీరుతామని, ప్రజలకు ఆమోదయోగ్యమైన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడతామని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు.

## చేతులు జోడించే తత్వం కాదు, నాది పోరాట పంథా : రాహుల్ గాంధీ

చెన్నై : కాంగ్రెస్ పార్టీని వీడిపోతున్న నేతల గురించి ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. చేతులు జోడించి, బీజేపీతో సయోధ్య కుదుర్చుకోవడం కొందరికి చాలా సులువని, తన స్వభావం అలాంటిది కాదని, తనది పోరాట పంథా అని చెప్పారు. భారత దేశ భావనకోసం తాను పోరాడతానని తెలిపారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ దేశంలోని అన్ని వ్యవస్థలను తన స్వాధీనంలోకి తెచ్చుకుందని ఆరోపించారు. ఇక పోరాటం భారత దేశ రాజ్య నిర్మాణం, ప్రతిపక్షాల మధ్యేనని చెప్పారు. ఇటీవల గులాం నబీ ఆజాద్ వంటి నేతలు పార్టీని వీడుతుండటంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, వారిపై ఒత్తిడి పెంచగలిగే శక్తిసామర్థ్యాలు కచ్చితంగా తన కన్నా బీజేపీకి ఎక్కువగా ఉన్నాయని చెప్పారు.



## నెల్లూరులో ఎస్పీ బాలు పేరిట పార్క్ ప్రారంభం



నెల్లూరు : ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరిట పార్కును నిర్మించారు. ఈ పార్కును నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ పీ అనిల్ కుమార్ యాదవ్ ప్రారంభించారు. పార్కులో నెలకొల్పిన ఎస్పీబీ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. నగరంలోని ఆదిత్య నగర్‌లో ఈ పార్కును పునరుద్ధరించారు. పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నుడా వైస్ చైర్మన్ ఓబులేసు నందన్, కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం పేరిట పార్కును ప్రారంభించడం ఆయనకు మనమిచ్చే గౌరవమని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాద్ అన్నారు. నెల్లూరు నగరానికి చెందిన వ్యక్తి కూడా కావడంతో బాలుకు నివాళిగా రూ.90 లక్షలతో పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజల మదిలో ఆయన జ్ఞాపకాలను సజీవంగా ఉంచేందుకు ఆయన పేరును ఈ పార్కుకు పెట్టినట్లు చెప్పారు. ఈ పార్కులో రెండు బ్యాడ్మింటన్ కోర్టులు, జిమ్, యోగా కోసం ఒక గదిని నిర్మించారు. రూ.25 లక్షల అంచనా వ్యయంతో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు మాజీ మంత్రి అనిల్ తెలిపారు. నగరంలో రూ.15 కోట్ల అంచనా వ్యయంతో 19 పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో నగరంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను ఆ పార్టీ నేతలు బయటపెట్టాలని, ఈ అంశంపై ఎక్కడైనా ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అనిల్ చెప్పారు.

## బ్రిటన్ రాజుగా బాధ్యతలు స్వీకరించిన ఛార్లెస్-3



లండన్: ప్రిన్స్ ఛార్లెస్ ఫిలిప్ ఆర్థర్ జార్జ్.. ఛార్లెస్ -3ని బ్రిటన్ రాజుగా అధికారికంగా ప్రకటించారు. సెయింట్ జేమ్స్ ప్యాలెస్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. అంతకు ముందు క్వీన్ ఎలిజబెత్ అస్తమించినట్లు ప్రకటన చేశారు. ఛార్లెస్-3ను రాజుగా ప్రకటించిన తర్వాత ఆయన సదరు డాక్యుమెంట్‌పై సంతకం చేశారు. ఈ కార్యక్రమానికి సుమారు 200 మంది హాజరయ్యారు. డాక్యుమెంట్లపై సంతకం చేయడానికి ముందు రూమ్‌లో ఉన్న అందరూ గాడ్ సేవ్ ద కింగ్ అని నినాదం చేశారు. బ్రిటన్ ప్రధాని లిజ్ ట్రస్‌తో పాటు ఆరు మంది మాజీ ప్రధానులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజుగా ప్రమాణం చేసిన కింగ్ ఛార్లెస్ తన తల్లి మరణవార్తపై ప్రకటన చేశారు. జీవిత కాలం ప్రేమను పంచాలని, నిస్వార్థ సేవ చేయాలని తన తల్లి తనకు నేర్పినట్లు ఛార్లెస్ తెలిపారు. తన తల్లి రాజ్యాన్ని ఏలిన సమయం, ఆమె అంకిత భావం, ఆమె భక్తి అసాధారణమైనవని అన్నారు. ఇది విషాదకర సమయమే అయినా, ఆమె విశ్వసనీయమైన జీవితానికి థ్యాంక్స్ చెబుతున్నట్లు కింగ్ ఛార్లెస్ తెలిపారు.

## రెండునెలల్లో సీపీఎస్‌పై నిర్ణయం : మంత్రి బొత్స



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ ఉద్యోగుల డిమాండ్ పరిష్కారానికి ప్రభుత్వం మరో రెండు నెలల్లో నిర్ణయం తీసుకుంటుందని ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఇవాళ ప్రభు త్వ ఉద్యోగుల సంఘం మహాసభల్లో పాల్గొన్న మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆమోద యోగ్యంగా ఉంటుందని , ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఈ ఏడాది ఆఖరికల్లా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వైసీపీ పార్టీ ఇచ్చిన వంద హామీల్లో సీపీఎస్ రద్దు ఒకటని, సీపీఎస్‌పై ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. చర్చల ద్వారానే ఉద్యోగుల సమస్యలకు పరిష్కా రం లభిస్తుందన్నారు. సీపీఎస్ కంటే మెరుగైన పరిష్కారం చూపాలని సీఎం స్పష్టం చేశారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు వచ్చే నెల నుంచి కొత్త పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించనున్నామని వెల్లడించారు. వచ్చే మూడు నెలల్లో విద్య, వైద్యశాఖలో ప్రమోషన్లు ఉంటాయని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములేనని తెలిపారు.

## ఏపీ మంత్రులు రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదు: రామకృష్ణ



అమరావతి : అమరావతి రాజధాని కోసం రైతులు మరోసారి చేపట్టనున్న మహాపాదయాత్రపై ఏపీ మంత్రులు రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదని సీపీఐ నేత రామకృష్ణ అన్నారు. గత మూడు సంవత్సరాలుగా అమరా వతి రైతుల పోరాట ఫలితంగా హైకోర్టు ఇచ్చిన తీర్పుతనైనా అమరావతి అంశం ముగిసిందన కున్నామని తెలిపారు. నాడు ప్రభుత్వం విజ్ఞత ప్రదర్శించి వెనక్కి తీసుకున్నట్లు అఫిడవిట్ వేశారని వెల్లడించారు.

మళ్లీ ఇప్పుడు మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని దుయ్యబట్టారు. ఏపీలో మంత్రుల వ్యవహారం వల్ల విశాఖ నగరం ధ్వంసానికి గురవుతుందని ఆరోపించారు. ఒక్క రాత్రిలో విశాఖ అభివృద్ధి కాలేదని, ఉక్కు కర్మాగారం,పోర్టు వంటివి వచ్చాక అభివృద్ధి చెందిందన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జగన్ మేనమామ కుమారుడు లేపాక్షి భూములను కొంటున్నారని, లేపాక్షి భూములను రైతులకు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## 15 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

అమరావతి : ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నట్లు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నోటిఫికేషన్ జారీ చేశారు. సమావేశంలో ప్రవేశపెట్టే బిల్లుల వివరాలను ఈనెల 12వ తేదీలోగా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపాలంటూ సీఎంవో ప్రత్యేక కార్యదర్శి కెఎస్. జవహర్‌రెడ్డి అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. కాగా అసెంబ్లీ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనేది అసెంబ్లీ వ్యవహారాల కమిటీ సమావేశంలో నిర్ణయించనున్నారు. చివరిసారిగా జులై 19 నుంచి ఐదురోజుల పాటు సమావేశాలు జరిగాయి.




## ఏపీలో అశాంతి సృష్టించేందుకు చంద్రబాబు కుట్ర : ఏపీ స్పీకర్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ స్పీకర్ తమ్మినేని సీతారాం మరోసారి ప్రతిపక్ష టీడీపీ అధినేత చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. అమరావతి రాజధాని కోసం రైతులు చేస్తున్న ఆందోళనల వెనుక చంద్రబాబు పాత్ర ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో అశాంతి సృష్టించాలని కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ఉత్తరాం ధ్ర అభివృద్ధి చంద్రబాబుకు ఇష్టం లేదని అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ టీడీపీ కావాలనే రైతులను రెచ్చగొడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో అశాంతి సృష్టించి, లా అండ్ ఆర్డర్ సమస్య తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మూడు రాజధానులు తమ పార్టీ నిర్ణయమని అంతిమంగా అదే నిజమవుతుందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి పాలన వికేంద్రీకరణతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



## ఏపీలో భారీ వర్షాలు..

నిండుకుండల్లా జలాశయాలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వానలు దంచికొడుతున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాష్ట్రంలోని జలాశయాలన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు అనంతపురం జిల్లాలోని చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. మరికొన్ని రోజులు ఇదే మాదిరిగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు హెచ్చరించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వానలకు కోనసీమ జిల్లాలోని లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. సింగంపల్లిలోని ప్రధాన రహదారిపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు జిల్లాలోనూ వానలు పడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అనేక పట్టణాల్లో డ్రైనేజీలు పొంగి దుర్వాసన వెదజల్లుతుంది. అనంతపురం జిల్లాలోనూ వర్షాలు దంచి కొడుతున్నాయి. చెరువులన్నీ నిండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర ఆంధ్ర ప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని పశ్చిమ మధ్య వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఈ కారణంగా ఆదివారం, సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని ఐఎండీ పేర్కొన్నది. సోమవారం వరకు ఒడిశా తీరం వెంబడి, వాయవ్య పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్రంలోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది.

# సంపాదకీయం

ఆదివారం 11-09-2022

## ఢిల్లీ , సెంటర్ సర్వీస్ ల వివాదం

ఢిల్లీలో సేవల నియంత్రణపై విచారణకు జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసినట్లు ఆగస్టు 22న సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశాన్ని మే 6న రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేశారు. సర్వీసుల నియంత్రణపై కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాల అధికారాల పరిధికి సంబంధించిన వివాదాస్పద అంశాన్ని సెప్టెంబర్ 27న విచారించేందుకు టైమ్‌లైన్‌ను నిర్ణయిం చనున్నట్లు సుప్రీంకోర్టు ఈరోజు తెలిపింది.జస్టిస్ డి. వై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇది గ్రీన్ బెంచ్ అని, విచారణలో ఎటువంటి పత్రాలను ఉపయోగించరాదని పేర్కొంది. న్యాయమూర్తులు ఎంఆర్ షా, కృష్ణ మురారి, హిమా కోహ్లీ , పిఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం, అక్టోబర్ మధ్య నాటికి కేంద్రం ఢిల్లీ ప్రభుత్వ శాసన, కార్యనిర్వాహక అధికారాల పరిధికి సంబంధించిన వ్యాజ్యాన్ని తాత్కాలి కంగా విచా రణను ప్రారంభిస్తామని తెలిపింది.ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అడ్మిషన్లు, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించా ల న్న కేంద్రం నిర్ణయం చెల్లుబాటుపై భారత ప్రధాన న్యాయమూర్తి యూయూ లలిత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం సెప్టెంబర్ 13నుంచి విచారణ ప్రారంభించనుందని న్యాయవాదులు తెలియ జేసిన నేపథ్యంలో ఈ పరిశీలన జరిగింది. ఢిల్లీ–కేంద్రం మధ్య సర్వీసు వివాద కేసులో పలువురు సీనియర్ న్యాయవాదులు ఈడబ్ల్యూఎస్ విషయం లో కూడా వాదిస్తారని, అందువల్ల వారికి వసతి కల్పించాలని ధర్మాసనానికి సూచించింది. ఈడబ్ల్యూఎస్ వ్యవహారంలో విచారణ దశను చూసి, తదుపరి ఎలా కొనసాగాలనే దానిపై ఆదేశాల కోసం సెప్టెంబర్ 27న జాబితా చేస్తామని కోర్టు తెలిపింది. కాగితాన్ని ఉపయోగించడం లేదని జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు, పుస్త కాలు, కేసు చట్టాలు, వ్రాతపూర్వక సమర్పణలతో సహా అన్ని సంబంధిత విషయాలను స్కాన్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఢిల్లీ ప్రభుత్వం, కేంద్రం తరఫున వాదిస్తున్న న్యాయవాదులు షాదన్ ఫరాసత్ , పరమేష్ మిశ్రా తమ సంకలనాలను సిద్ధం చేసి స్కానింగ్ , సర్క్యులేషన్ కోసం కోర్టు మాస్టర్‌కు సమర్పిం చాలని బెంచ్ కోరింది.ఢిల్లీలో సేవల నియంత్రణపై విచారణకు జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసినట్లు ఆగస్టు 22న సుప్రీంకోర్టు పేర్కొంది.ఈ అంశాన్ని మే 6న రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేశారు. సేవలపై నియంత్రణ పరిమిత సమస్యను రాజ్యాంగ ధర్మాసనం అన్ని ఇతర చట్టపరమైన ప్రశ్నలను విపులంగా డీల్ చేయలేదని సుప్రీంకోర్టు పేర్కొంది.ఈ బెంచ్‌కి సూచించబడిన పరిమిత సమస్య, సర్వీస్ అనే పదానికి సంబంధించి కేంద్రం, ఎన్‌సీటీ ఢిల్లీ శాసన, కార్యనిర్వాహక అధికారాల పరిధికి సంబంధించినది. ఈ న్యాయస్థానం , రాజ్యాంగ ధర్మా సనం, ఆర్టికల్ 239ఏఏ(3)(ఏ)ని వివరిస్తుంది. రాజ్యాంగంలోని, రాష్ట్ర జాబితాలోని ఎంట్రీ 41కి సంబం ధించి అదే పదాల ప్రభావాన్ని ప్రత్యేకంగా వివరించడానికి ఏ సందర్భమూ కనుగొనబడలేదు.కాబట్టి, రాజ్యాంగ ధర్మాసనం అధికారిక ప్రకటన కోసం పైన పేర్కొన్న పరిమిత ప్రశ్నను సూచించడం సముచితమని మేము భావిస్తున్నామని పేర్కొంది. మరో వైపు కేంద్ర, రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే ధరలు దిగి వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ పై పన్ను తగ్గించినా.. కొన్ని రాష్ట్రాలు వ్యాట్‌ను తగ్గించకపోవడం ఈవిషయాన్ని నిర్మలా సీతారామన్ ఈసదస్సులో ప్రస్తావించారు. చమురుపై కేంద్రప్రభుత్వం రెండుసార్లు పన్ను తగ్గించిందని నిర్మలా సీతారామన్ గుర్తుచేశారు. రాష్ట్రాలు సైతం పన్ను తగ్గించాలని సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం జాతీయ సగటు కంటే అధికంగా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. చమురు ఉత్పత్తులపై పన్ను తగ్గించకపోవడం వల్ల ఆయా రాష్ట్రాల్లో ధరలు అధికంగా ఉన్నాయని చెప్పారు. అధిక ధరల నుంచి ప్రజలకు ఊరట కల్పించేందుకు కేంద్రప్రభుత్వం తన వంతుగా చర్యలు తీసుకుంటోందన్నారు. చౌకగా దొరుకుతున్న రష్యా చమురు కొనుగోలూ ఇందులో భాగమేనని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం కట్టడికి వడ్డీ రేట్లు తగ్గించడం ఒక్కటే సరిపోదని, ఆర్థిక విధానాలకు అనుగుణంగా మరిన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ద్రవ్యపరపతి విధాన నిర్ణయాలొక్కటే ద్రవ్యోల్బణం కట్టడికి సరిపోవని వివిధ దేశాల అనుభవాలు తెలియజేస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఈ ఏడాది ప్రారంభంలో క్రూడాయిల్ ధరలు దాదాపు రికార్డు స్థాయికి చేరుకున్నాయని, అమెరికా నేతృత్వంలోని పాశ్చాత్య దేశాలు రష్యాపై అనేక ఆంక్షలు విధించాయన్నారు. అయినా జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ రష్యా నుంచి చమురు దిగుమతులను పెంచాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు .239ఏఏలోని సబ్ ఆర్టికల్ 3(ఏ) రాష్ట్ర జాబితా లేదా ఉమ్మడి జాబితాలో పేర్కొనబడిన విషయాలపై ఢిల్లీ శాసనసభ యొక్క చట్టాన్ని రూపొందించే అధికా రంతో వ్యవహరిస్తుంది. ఫిబ్రవరి 14, 2019న, ఇద్దరు న్యాయమూర్తులు–బెంచ్, దాని విభజన తీర్పును దృష్టిలో ఉంచుకుని జాతీయ రాజధానిలో సేవల నియంత్రణ సమస్యను చివరకు నిర్ణయించడానికి ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్‌ను ఏర్పాటుచేయాలని భారత ప్రధానన్యాయమూర్తికి సిఫార్సు చేసింది.

## వెంకయ్య..మళ్లీ క్రియాశీలక రాజకీయాలు



నెల్లూరు, సెప్టెంబర్ 10, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఉప రాష్ట్రపతి పదవి నుంచి విరమించుకున్న తర్వాత రాజకీయాల్లోకి అడుగు పెట్టేది లేదని ప్రకటించిన వెంకయ్య ఇప్పుడు తన అభిమానుల కోసం జిల్లాల్లో పర్యటిస్తూ తన పాత మిత్రులను కలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారు కూడా ఆయనకు సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా ఆయన రాజమండ్రిలో జరిగిన సత్కార కార్యక్రమంలో పాల్గొన్నారు.రాజకీయాల నుంచి దూరమవ్వాల్సి రావడం తనను తీవ్రంగా బాధించిందని, చిన్నప్పుడే కన్నతల్లికి దూరమైన తనను కన్నతల్లి లాంటి పార్టీ ఉన్నతస్థానానికి తీసుకువెళ్లిందని రాజమండ్రిలో జరిగిన సమావేశంలో వెంకయ్య వ్యాఖ్యానించారు. తాజాగా ఆయనకు గుంటూరులో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, కామినేని శ్రీనివాస్, డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు హాజరయ్యారు.ప్రజల మధ్య ఉండి పనిచేయడమంటే తనకు ఎంతో ఇష్టమని, ఉప రాష్ట్రపతిగా ఉన్న సమయంలోనే ఆంక్షలన్నీ పక్కనపెట్టి దేశం మొత్తం పర్యటించానని గుంటూరు సమావేశంలో వెంకయ్య అన్నారు. పత్రికలు, వైద్యం, విద్య తదితర విభాగాలన్నీ ఒక మిషన్ కోసం నడిచేవని, ఇప్పుడు మాత్రం కమిషన్ కోసం నడుస్తున్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చట్టసభల్లో ఉండేవారు తమ భాషను హుందాగా ఉపయోగించాలని, దుర్భాషలాడటంకానీ, ఇతరత్రా పదాలు కానీ వాడొద్దని సూచించారు. తీవ్ర పదజాలం ఉపయోగిస్తూ చట్టసభల స్థాయిని తగ్గించడం మంచిది కాదని హితవు పలికారు. దేశంలో ఏం జరుగుతోంది అనే విషయమై ప్రపంచమంతా మనవైపే చూస్తోందనే విషయాన్ని గుర్తెరిగి మరింత బాధ్యతగా ఉండాలన్నారు.దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని గాంధీజీ ముందుకు నడిపించినా చాలామంది పోరాట యోధులకు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదని వెంకయ్య అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి కర్తవ్యపథ్‌ను ప్రారంభించడంతోపాటు నేతాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారనే విషయాన్ని గుర్తుచేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మిగతావారి పాత్ర కూడా తక్కువేం కాదన్నారు. మాతృభాషను మృతభాషగా చేయవద్దని, మొదటి ప్రాధాన్యం మాతృభాషకే ఇవ్వాలని, పరిపాలన కూడా తెలుగులోనే ఉండాలన్నారు. మాతృభాషలో చదివినవారు ఉన్నతస్థాయికి ఎదుగుతున్నారని, ఇంగ్లిషు, హిందీతోపాటు ఇతర భాషలు కూడా నేర్చుకోవాలని సూచించారు.జనంతో కలిసి ఉండాలనే తపన వెంకయ్య నాయుడికి తీరినట్లు లేదని, ఉప రాష్ట్రపతి పదవి నుంచి విరమించిన తర్వాత కూడా సభలు, సమావేశాలు జరుగుతుండటంపై ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. క్రియాశీల రాజకీయాలను నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన తర్వాత మళ్లీ ఇవేంటని చర్చించుకుంటున్నారు. విజయవాడలో జరిగే సమావేశంలో కూడా ఆయన పాల్గొనబోతున్నారు. వెంకయ్యనాయుడికి రాష్ట్ర పతి పదవి దక్కుతుందని తెలుగువారు భావించినా ఆయన ఉప రాష్ట్రపతి పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆయనకు ఇష్టం లేకపోయినా ఆ పదవిని పార్టీకోసం చేపట్టిన సంగతి తెలిసిందే.

## పులివెందుల కోసం కసరత్తు

కడప, సెప్టెంబర్ 10,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎవరికీ కొరుకుడు పడనిది ఉమ్మడి నెల్లూరు జిల్లా. ఈ జిల్లా ఓటర్ల తీర్పు ఎప్పుడు ఎటువైపు ఉంటుందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి. తలపండిన రాజకీయ నేతలు కూడా ఇక్కడి ఓటర్ల మనస్తత్వాన్ని అంచనా వేయలేకపోతున్నారు. ఇతర ఓటర్లు అధికారపార్టీకి మద్దతిచ్చిన సమయంలో ఇక్కడి ఓటర్లు ప్రతిపక్షాన్ని అక్కున చేర్చుకుంటారు. ఇతర జిల్లాల ఓటర్లు ప్రతిపక్షాన్ని అక్కున చేర్చుకున్న తరుణంలో వీరు అధికార పక్షాన్ని ఆదరిస్తారు. అంతటి సంక్లిష్టత నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఉంటుంది. వైసీపీకి కంచుకోటలాంటిది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట లాంటి ఈ జిల్లాపై ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టిసారించారు. ఈనెల 14వ తేదీన నెల్లూరులో మినీ మహానాడు నిర్వహిస్తున్నారు. తర్వాత మరో రెండురోజులు ఆయన ఇక్కడే మకాం వేయనున్నారు. 15వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గాలపై నేతలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. 16వ తేదీన నెల్లూరు నుంచి గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట మీదగా రోడ్ షో ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి ఆదరణ పెరుగుతోందని భావిస్తున్న చంద్రబాబు నెల్లూరు జిల్లా నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేందుకు రోడ్ షో నిర్వహించనున్నారు. కాంగ్రెస్ నుంచి వైసీపీవైపు మళ్లిన ఓటర్లు ఉమ్మడి రాష్ట్రాన్ని విభజించిన తర్వాత కాంగ్రెస్ పార్టీ బలం మొత్తం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా మారింది. వరుసగా జరిగిన రెండు ఎన్నికల్లోను ఇక్కడ వైసీపీ అభ్యర్థులు విజయం సాధించి ఆ పార్టీ కంచుకోటగా జిల్లాను మార్చారు. రానున్న ఎన్నికల్లో ఈ కంచుకోటను బద్దలు కొట్టాలని బాబు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ బలంగా ఉన్న జిల్లాలపై వైసీపీ ప్రత్యేక దృష్టి పెట్టగా, అందుకు విరుగుడుగా చంద్రబాబు వైసీపీకి బలంగా ఉన్న జిల్లాలపై దృష్టిపెట్టారు. రెండు పార్టీల అధినేతలు ఢీ అంటే ఢీ అంటున్న వాతావరణంలో చేయబోతున్న రోడ్ షోపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సగానికి సగమన్నా గెలవాలని.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ధాటికి ఇక్కడి టీడీపీ నేతలు నెమ్మదించారు. వారిలో చైతన్యం నింపి క్యాడర్ లో జోష్ తీసుకురావడానికి బాబు ప్రయత్నిస్తున్నారు. కొన్నాళ్లుగా జిల్లాల పర్యటనలతోపాటు మినీ మహానాడులు నిర్వహిస్తోన్న టీడీపీకీ అవన్నీ విజయవంతమవడంతో శ్రేణుల్లో ఉత్సాహం తొణికిసలాడుతోంది. నెల్లూరులో ఉన్న 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం ఐదు నియోజకవర్గాలైనా టీడీపీ పరం కావాలనేది అధినేత యోచనగా ఉంది. వైసీపీ కంచుకోటలపై ప్రత్యేకంగా దృష్టిసారించిన చంద్రబాబు వాటిని ఎలా చేధిస్తారో చూద్దాం.!

## చిత్తూరులో వైరల్ ఫీవర్స్



తిరుపతి, సెప్టెంబర్ 10, మ్మడి చిత్తూరు జిల్లాను డెంగ్యూ మలేరియా వైరల్ ఫీవర్లు పట్టి పీడిస్తున్నాయి. మారు మూల పల్లెల నుంచి నగరాల వరకు ఆసుపత్రులు జ్వర పీడితులతో నిండిపోతున్నాయి. జిల్లా ప్రజానీకం జ్వరాలతో వణుకుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పల్లెల్లో జ్వరాలు ముసురుకున్నాయి. చాలా మంది పరీక్షలు చేయించుకోకుండానే చికిత్స తీసుకుంటున్నారు. పరీక్షలు చేయించుకున్న వారిలో ఎక్కువ శాతం డెంగ్యూ లక్షణాలు భయటపడుతున్నాయి. దీంతో జ్వర బాధితులను డెంగ్యూ భయపెడుతోంది. ఇప్పటికే జిల్లాలో 80 వరకు కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించే అంశంగా మారింది.అధికారిక లెక్కల ప్రకారమే ఇప్పటి వరకు 80 వరకు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. గతేడాది ఉమ్మడి జిల్లాలో 213 డెంగ్యూ.. 4 మలేరియా కేసులు నమోదు కాగా... ప్రస్తుతం జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 80 డెంగ్యూ.. రెండు మలేరియా కేసులు అధికారికంగా నమోదయ్యాయి. చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్సలు పొందుతుండటంతో కొన్ని కేసులు అధికారికంగా నమోదు కాలేదంటున్నారు నిపుణులు. అక్కడక్కడా డెంగ్యూ బారిన పడి చనిపోతున్న ఘటనలు ఉన్నాయి. సకాలంలో గుర్తించకపోవడం, ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటూ పరీక్షలను ఆలస్యం చేయడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వర్షాకాలానికి ముందే సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ అన్ని కేటగిరీల సిబ్బందికి మాన్యువల్ ఇచ్చి శిక్షణ ఇచ్చింది. కానీ సమావేశాల ఫలితం కాగితాల్లో రికార్డులకెక్కిందే తప్పా... క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. దీంతో జ్వరాల తీవ్రత ఎక్కువైందన్న విమర్శలు వెలువెత్తాయి. మరోవైపు వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాలలో ఈ సమస్య మరింత జఠిలంగా మారగా... పంచాయతీలకు నిధులు లేక వారు పారిశుధ్యం వైపు కన్నెత్తి చూడటం లేదు. స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటివి రెగ్యులర్ గా చేయడం లేదు. డెంగ్యూ భయంతో జ్వరాలు వచ్చిన వారు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అక్కడ రక్తపరీక్షలు, బెడ్ ఛార్జీలు, మందులు అంతా కలిపి రూ.20 వేల నుంచి 30 వేలు ఖర్చవుతోందని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి ఆసుపత్రుల్లో ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

## అత్మహత్యల నివారణ



కాకినాడ అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం" సెప్టెంబర్–10 పురస్కరించుకుని శనివారం జిల్లా పోలీసు శాఖ, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ల అధ్వర్యంలో చేపట్టిన "ఆత్మహత్యల నివారణ – అవగాహన ర్యాలీ" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ

### - అవగాహన ర్యాలీని ప్రారంభించిన జిల్లా ఎస్పీ

రవీంద్రనాథ్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక రంగరాయ మెడికల్ కాలేజీ నుండి భానుగుడి జంక్షన్ వరకు కొనసాగిన ఈ ర్యాలీ నందు ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్లు, జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది, మహిళా పోలీసులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక యువత, వివిధ కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఆత్మహత్యలకు వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ, ప్లకార్డులను చేతబట్టి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.ర్యాలీ అనంతరం ర్యాలీలో పాల్గొన్న సభ్యులందరూ భానుగుడి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డయాస్ వద్దకు చేరుకొని ఆత్మహత్యల వ్యతిరేక ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతు చాల మంది చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని, నిత్య జీవితంలో సమస్యలు వస్తుంటాయని, వాటికి అధైర్యపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని, సమస్యలకు పరిష్కారం బలాన్మరణం కాదనే విషయాన్నీ గమనించాలని తెలియజేసారు.

## సహచరులపై అసంతృప్తి

విజయవాడ, సెప్టెంబర్ 10ప్రస్తుత మంత్రి వర్గం పై ముఖ్యమంత్రి జగన్ అసంతృప్తిగా ఉన్నారా? త్వరలో మంత్రివర్గాన్ని ఆయన విస్తరించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి పార్టీ వర్గాలు. ప్రస్తుత మంత్రులు దేనినీ పట్టించుకోవడం లేదన్న అసహనంతో ముఖ్యమంత్రి జగన్ ఉన్నారు, విపక్షాల విమర్శలను కూడా తిప్పికొట్టడానికి తీరిక లేకుండా మంత్రులు ఉన్నారని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అందుకే ఈ మంత్రివర్గంలో కొందరికి ఉద్వాసన పలికితే మిగిలిన వారు అప్రమత్తమవుతారన్న ఆలోచనతో జగన్ ఉన్నారని చెబుతున్నారు. తొలి మంత్రి వర్గంలో మూడేళ్ల పాటు జగన్ మంత్రివర్గ సభ్యులపై ఈ స్థాయిలో అసహనం వ్యక్తం చేయలేదు. ఆ బ్యాచ్ లో విపక్షాలకు ధీటుగా విమర్శించే వారు ఎక్కువగా ఉన్నారు. నిత్యం మీడియా సమావేశాలతో విపక్షాలపై విరుచుకుపడేవారు.కానీ ప్రస్తుత మంత్రివర్గం అందుకు భిన్నంగా ఉంది. ముగ్గురు నలుగురు మంత్రులు మినహా ఎవరూ పెద్దగా రెస్పాన్స్ కావడం లేదు. అంబటి రాంబాబు, జోగి రమేష్, ఆర్కే రోజా, గుడివాడ అమరనాథ్ వంటి వారు మినహా సీనియర్ మంత్రులు ధర్మాన ప్రసాదరావు లాంటి వారు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. సీనియర్లకు మంత్రి పదవులు ఇచ్చినా వారు మౌనంగా ఉండటాన్ని ముఖ్యమంత్రి జగన్ తప్పుపడుతున్నారు. ప్రభుత్వం పై నిందలు మోపుతున్నా నోరు మెదపక పోవడం నిర్లక్ష్యమా? లేదా నిరాసక్తతా? అన్నది తెలియకుండా ఉందని ఆయన అన్నట్లు తెలిసింది. జగన్ మాత్రం 60 శాతం మంది మంత్రులపై అసంతృప్తితో ఉన్నారని సమాచారం. ఈ కేబినెట్ తో ఎన్నికలకు వెళ్లడం కష్టమేనని జగన్ ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారిని కూడా కేబినెట్ లోకి తీసుకున్నానని, సీనియారిటీని పక్కన పెట్టి సామాజికవర్గాలకే ప్రాధాన్యత ఇచ్చినా మంత్రులు ఈ రకంగా వ్యవహరించడం సరికాదని జగన్ అభిప్రాయపడుతున్నారు.. అందుకే నవంబరులో మంత్రి వర్గాన్ని మరోసారి విస్తరించాలని జగన్ అభిప్రాయపడుతున్నారు. ఈలోపు మంత్రులు తమ పనితీరు మార్చుకోవాలని జగన్ ఇప్పటికే హెచ్చరించారు. అయినా కొందరు మంత్రుల పనితీరు పట్ల సంతృప్తికరంగా లేరు. ఒకరిద్దరు మంత్రులను మార్చాలని జగన్ డిసైడ్ అయ్యారంటున్నారు. అందులో మహిళ మంత్రి కూడా ఒకరున్నారని తెలిసింది. ఎన్నికలకు వెళ్లాలంటే ఈ కేబినెట్ తో కుదరదన్న అభిప్రాయానికి జగన్ వచ్చినట్లు తెలిసింది. అందుకే కేబినెట్ ను నవంబరు నెలలో మార్చేందుకు జగన్ సిద్ధమవుతున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

## ఆ 25 మంది లెక్కేంటీ

విజయవాడ, సెప్టెంబర్ 10, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఎప్పటికప్పుడు పార్టీ పరిస్థితిపై సమీక్ష చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ఆయన తనకున్న ప్రత్యేక మార్గాల ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్నారు. ఇక ఎటూ ఐ ప్యాక్ సర్వే ఉండనే ఉంది. తాజాగా లెక్కల ప్రకారం 25 మంది ఎమ్మెల్యేలకు గండం పొంచి ఉందని సమాచారం. 25 మంది వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు గెలవడం కష్టమని సర్వేల్లో తేలింది. వీరిలో ఎక్కువ మంది తొలిసారి గెలిచిన వారేనని తెలుస్తోంది. వీరి పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని, దాని కారణంగా ప్రజలు పార్టీ వైపు మొగ్గు చూపడం లేదని తెలిసింది. నిన్న మొన్నటి వరకూ యాభై మంది వరకూ ఎమ్మెల్యేలు కష్టకాలంలో ఉన్నారని జగన్ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమీక్షలో వెల్లడించారు. వీరంతా తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని కోరారు. పనితీరు మెరుగుపర్చుకోకుంటే తాను టిక్కెట్ ఇవ్వనని కూడా ఖరాఖండీగా ఆ సమావేశంలో చెప్పారు. అప్పుడే వారికి వార్నింగ్ ఇచ్చారు. కొన్ని పేర్లను కూడా బయటకు చెప్పారు. తన వద్ద సర్వే నివేదిక ఉందని ఆయన చెప్పడంతో వర్క్ షాప్ కు హాజరైన ఎమ్మెల్యేలు షాక్ కు గురయ్యారు. పనితీరు మార్చుకోవడానికి ఆరు నెలల సమయం ఇచ్చారు. అయితే గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిన తర్వాత కొందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో పుంజుకున్నట్లు జగన్ కు అందిన తాజా సమాచారం మేరకు తేలింది. 25 మంది ఎమ్మెల్యేలు తమ పనితీరును మెరుగుపర్చుకోవడంతో వారి గ్రాఫ్ నియోజకవర్గాల్లో గ్రాఫ్ పెరిగింది. దీంతో వారు గండం నుంచి తప్పించుకున్నారని తెలిసింది. ప్రధానంగా ఉత్తరాంధ్ర, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో ఈ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పట్టు పెంచుకున్నారని జగన్ కు అందిన సర్వేల ద్వారా తేలింది. మిగిలిన 25 మంది ఎమ్మెల్యేలు మాత్రం ఇంకా డేంజర్ జోన్ లోనే ఉన్నారని సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఎమ్మెల్యేలు ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. వైసీపీ అధినేతగా జగన్ కేవలం ఐ ప్యాక్ సంస్థ ఇచ్చే సర్వే నివేదికలపై ఆధారపడటం లేదు. ప్రతి నియోజకవర్గంలో జగన్ తనకంటూ ప్రత్యేక వర్గాన్ని ఏర్పరచుకున్నారు. వారు ఏ పదవుల్లోనూ ఉండరు. జగన్ కు ఎప్పటికప్పుడు నియోజకవర్గం గురించి నివేదికలు అందివ్వడమే వారి పని. దీంతో పాటు ముఖ్య కార్యకర్తల సమావేశాలు జగన్ వరసగా జరుపుతున్నారు. ఇప్పటికే కుప్పం, రాజాం నియోజకవర్గాల సమీక్షను చేశారు. కుప్పంలో భరత్ ను క్యాండిడేట్ గా ఇప్పటికే ప్రకటించారు. అంటే కొంత ఇబ్బంది ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు మాత్రం జగన్ ఫైనల్ వార్నింగ్ ఇవ్వనున్నారని తెలిసింది. అప్పటికీ వారు తమ పనితీరు మార్చుకోకుంటే టిక్కెట్ ఇవ్వకూడదన్నది జగన్ నిర్ణయంగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఆరాచకశక్తులను ప్రోత్సహిస్తున్న వైకాపా

ఏలూరు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో గ్రామంలో అరాచక శక్తిగా ఉన్న కామిరెడ్డి నాని లాంటి వాళ్ళను ప్రోత్సహిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆరోపించారు. ఆత్మహత్యకు పాల్పడిన పప్పల సాయి శ్రీరామవరం గ్రామంలో వైకాపా నేతలు చేస్తున్న జూదాలు, పేకాట క్లబ్బులు,అసాంఘిక కార్యకలాపాలపై ఇది పద్ధతి కాదని సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వేధింపులకు గురిచేశారు. ఆత్మహత్యకు పాల్పడిన పప్పల సాయి టీడీపీ అభిమాని. ఆ గ్రామ నాయకుడు కామిరెడ్డి నాని,ఆయన అనుచరులు స్థానిక పోలీసులపై వత్తిడి తీసుకువచ్చారని,దానికి సంబంధించిన ఆడియో రికార్డింగ్స్ బాధితుడి వద్ద ఉన్నాయి. టీడీపీ కార్యకర్తలయితే చిన్న కేసు అయినా లోపల పడవేస్తున్నారని,అదే వైసీపీ నాయకులయితే విజయవాడలో మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి.గాంధీ ని కన్ను పగలగొట్టిన వారికి 41 నోటీసు యిచ్చి ఇళ్లకు పంపివేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో గ్రామంలో అరాచక శక్తిగా ఉన్న కామిరెడ్డి నాని లాంటి వాళ్ళను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని పోలీసులు కూడా తెలుసుకోని ప్రవర్తించాలని ఆగ్రహం వ్యక్తం చేసారు. జిల్లా ఎస్పీకి కూడా నేరుగా సాయి వాట్సప్ ద్వారా బాధను వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. కనీస సమాచారం కూడా కింద స్థాయి సిబ్బందికి ఇవ్వలేదని అన్నారు. స్థానిక నాయకుడు కామిరెడ్డి నాని,ఆయన అనుచరుల ఆగడాలు గ్రామంలో ఎక్కువయ్యాయి. పప్పల సాయి నిజంగా తప్పు చేస్తే శిక్షించాలని,అతన్ని మేము వెనకేసుకురామని,ఏ తప్పు చేయని యువకుడిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారు.

# నాగ్ పొలిటికల్ ఎంట్రీ



విజయవాడ, సెప్టెంబర్ 10, అక్కినేని నాగార్జునకు అలాంటి ఆలోచన లేదు. ఆ ఉద్దేశమూ లేదు. అయినా అప్పుడే, అంతా అయిపోయినట్లే ప్రచారం జరుగుతోంది. కనీసం వన్ సైడ్ లవ్ అయినా లేకుండానే, ఏకంగా ట్రైయాంగిల్ లవ్ స్టోరీ అల్లేసిన విధంగా, సోషల్ మీడియా క్రియేటివ్ రైటర్స్ జగన్, అక్కినేని నాగార్జున మధ్య పొలిటికల్ లవ్ స్టోరీ ని అల్లేశారు. అవును మనం,మాట్లాడు కుంటోంది బిగ్ బాస్ నాగార్జున పొలిటికల్ ఎంట్రీ గురించే.. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితో ఆయన ప్రేమలో పడ్డారంటూ వస్తున్న కథనాల గురించే. గత కొద్ది రోజులుగా, సోషల్ మీడియాలో కొంత వరకు మెయిన్ స్ట్రీమ్ మీడియాలోనూ ఇలాంటి వదంతులు బాగా షికారు చేస్తున్నాయి. నాగార్జున త్వరలో పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నారని, వైసేపీలో చేరుతున్నారని, అదే విధంగా విజయవాడ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారని, వండి వార్చిన కథనాలు చాలానే వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా, గాలి కథలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచే వైసీపీ సోషల్ మీడియాలో ఈ 'వంటక' స్టోరీ బాగా వైరల్ అవుతోంది. అయితే, ఇందులో అంతా కాకున్నా కొంతైనా నిజం ఉందా అంటే, అసలే లేందంటున్నారు, ఆ ఇద్దరినీ ఎరిగిన సినీ, రాజకీయ రంగ ప్రముఖులు. నిజానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురించి, ముఖ్యంగా ఆయనకు సినిమా రంగం గురించి, సినిమా హీరోలు, నిర్మాతల గురించి ఉన్న 'గౌరవ' భావం తెలిసిన ఎవరు, ఆయనతో రాజకీయ సంబంధాలు పెట్టుకునే సాహసం చేయరని అంటున్నారు. అలాంటిది, అందాల నటుడు, అక్కినేని నాగేశ్వరరావు వారసుడు,అన్నిటినీ మించి,నాగేశ్వరరావు నుంచి నటనతో పాటు వ్యాపార సూత్రాలనూ బాగా వంట పట్టించుకున్న నాగ్ అలాంటి తప్పు అసలే చేయరని అంటున్నారు. నాగార్జున ప్రధానంగా నటుడే కావచ్చును,కానీ, అంతకు మించి ఆయన,ఓ మంచి బిజినెస్ మ్యాన్, అయన వేసే ప్రతి అడుగులో 'నా కేంటి?' అని ఒకటికి పది సార్లు బేరీజు వేసుకుని ఆ తర్వాతనే ముందడుగు వేస్తారని అంటారు. అన్నిటినీ మించి ఆయనకు రాజకీయ సొద అసలే గిట్టదని అంటారు. అలాగని ఆయనకు రాజకీయ సంబంధాలు లేవా అంటే ఉన్నాయి.. అయితే... అవన్నీ కూడా వ్యాపార సంబధాలతో ముడి పడిన రాజకీయ సంబంధాలే తప్ప, రాజకీయ రంగులు పూసుకునే సంబంధాలు కాదని అంటారు. కారల్ మార్ఫ్స్, 'మానవ సంబంధాలు అన్నీ ఆర్థిక సంబంధాలే' అంటూ చేసిన సూత్రీకరణను కమ్యూనిస్టులు ఎంతవరకు నమ్ముతారో ఏమో కానీ, అక్కినేని నాగార్జున మాత్రం పూర్తిగా నమ్ముతారని, ఆర్థిక ప్రయోజనాలు లేకుండా ఆడుకు ముందుకు వేయరని అంటారు. అవును, ఆయన వైఎస్ ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో, ఆరోగ్యశ్రీ ప్రకటనలో నటించారు. అలాగే జగన్ రెడ్డి పాద యాత్ర సమయంలోనూ ఆయన వైసేపీకి మద్దతు తెలిపినట్లు ప్రచారం జరిగింది కానీ, ఆయన ఎప్పుడూ బహిరంగంగా అలాంటి ప్రకటన చేయలేదు. నాగర్జున, నాగ చైతన్య అభిమాన సంఘం అధ్యక్షుడి పేరున బి,రాము అనే వ్యక్తి చేసిన ప్రకటనను నాగార్జునకు ముడి పెట్టి వైసేపీ నాయకులు ప్రచారం చేసుకున్నారని అంటారు. నాగార్జున అప్పుడు గానీ, ఇప్పుడు గానీ, ఎప్పుడూ ఒక్క వైసీపీ కనే కాదు ఏ పార్టీకి కూడా బహిరంగంగా మద్దతు ఇవ్వలేదు. అదలా ఉంటే గతంలో రాజ్యసభ టికెట్' కు సంబంధించి చిరంజీవితోనూ జగన్ రెడ్డి ఇలాంటి కథనే నడిపించారు. లంచ్ కి పిలిచి సోషల్ మీడియాలో రాజ్యసభ టికెట్ జరిపించారు. చివరకు మెగా స్టార్ నవ్వుల పాలయ్యారు. మీడియా ముందు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చిందని గుర్తు చేస్తున్నారు .ఇక పోసానీ, అలీ, ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృధ్వీ రాజ్ విషయం అయితే చెప్పనే అక్కరలేదు. ఇదిగో అదిగో అంటూ నామినేటెడ్ పదవులను .. చూపించడమే కానీ.. ఇచ్చింది లేదని, చివరకు ఇచ్చినా వద్దనే స్థితికి వారిని నేట్టివేశారని అంటారు. అయితే ఒకటి మాత్రం నిజం. ఇప్పుడు విజయవాడ నియోజక వర్గం నుంచి పోటీచేసేందుకు, వైసీపీకి సరైన అభ్యర్థి లేరు.ఎన్నికల్లో ఈ నియోజక వర్గం నుంచి టీడీపీ అభ్యర్థి కేసీనేని నాని గెలిచారు. ఆయనపై పోటీచేసిన వైసీపీ అభ్యర్థి పొత్తూరి వరప్రసాద్ ఇప్పుడు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అలాగే, 2014లో పోటీ చేసిన కోనేరు రాజేంద్ర ప్రసాద్ కూడా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు.సో .. అభ్యర్థి వేటలో ఉన్న వైసీపీ నాగార్జునను తెర మీదకు తెచ్చిందని అంటున్నారు. అయితే, సహజంగానే వ్యాపార రాజకీయాలు తప్పించి ప్రత్యక్ష రాజకీయాల పట్ల అంతగా ఆసక్తి లేని నాగార్జున పొలిటికల్ ఎంట్రీ ఇచ్చే అవకాశం అయితే ప్రస్తుతానికి లేదనే అంటున్నారు.

## చికాగోలో స్వామి వివేకానందుడి చరిత్రాత్మక ప్రసంగానికి 129 ఏళ్లు



1893లో చికాగో వేదికగా జరిగిన సర్వమత సమ్మేళనానికి తొలిసారిగా హాజరైన స్వామి వివేకానందుడు, ఒక్క మాటతోనే ప్రపంచాన్ని భారతవైపు తిప్పుకునేలా చేశారు. చికాగోలో సర్వమత సమ్మేళనం 1893, సెప్టెంబరు 11న ప్రారంభమైంది. ఈ మహాసభకు వివిధ దేశాలకు చెందిన వేలాది మంది ప్రతినిధులు హజరయ్యారు. వీరందరిలో కెల్లా భారత్ తరపున పాల్గొన్న స్వామి వివేకానంద పిన్న వయస్కుడు. ఈ సమ్మేళనానికి హాజరైన వారంత తమ ప్రసంగ పాఠాలను ముందుగానే తయారు చేసుకున్నారు. అయితే స్వామిజీ దగ్గర అలాంటిదేమి లేదు. అందుకే తన ప్రసంగాన్ని చివరలో ఉంచమని సభాధ్యక్షుడికి విజ్ఞప్తి చేశారు. అయితే వివేకానందుడు దాదాపు రెండు నెల ముందే అమెరికా చేరుకున్నారు.స్వామిజీ చికాగో నగరానికి జూలైలోనే చేరుకొన్నారు. కానీ విశ్వమత సభలు సెప్టెంబరులో ప్రారంభమవుతాయని, ఆ సభల్లో పాల్గొనడానికి ధ్రువ ప్రత్రాలు తప్పనిసరి అని, అవి ఉన్నా వక్తలను అనుమతించే సమయం ఎప్పుడో దాటి పోయిందని తెలిసి బాధపడ్డారు. అక్కడి వాతావరణానికి తట్టుకోలేక ఇబ్బంది పడ్డారు. బోస్టన్ నగరంలో ఖర్చు తక్కువని ఎవరో చెప్పగా విని అక్కడకు రైలులో వెళ్లారు . బోస్టన్ చేరుకున్న వివేకానందుడికి హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జేహెచ్ రైట్స్‌తో పరిచయం ఏర్పడింది. విశ్వమత సభలో పాల్గొనడానికి తనకు అనుమతి పత్రం కావాలని స్వామిజీ ఆ ప్రొఫెసర్‌ను అడిగితే... మిమ్మల్ని ధ్రువపత్రం అడగడమంటే "సూర్యుడికి ప్రకాశించే హక్కు ఎవరిచ్చారని అడగడమే" అని చెప్పి "ఈ వ్యక్తి మేధస్సు, పాండిత్యం మన దేశంలోని గొప్ప గొప్ప పండితులను అందరిని కలిపితే వచ్చే పాండిత్యం కన్నా చాలా గొప్పదని అందులో రాశారు.అమెరికా సోదర సోదరీ మణులారా.. అని స్వామి వివేకానంద తన ప్రసంగాన్ని ప్రారంభించగానే దాదాపు మూడు నిమిషాల పాటు కరతాల ధ్వనులతో ప్రాంగణం దద్దరిల్లింది. వివేకానందుడి ప్రేమ పూర్వక పిలుపునకు సభికులు దాసోహం అన్నారు. భారతీయ ధర్మం అన్ని మతాలను గౌరవిస్తుందని, చిన్న చిన్న నదులు ప్రవహించి చివరికి సముద్రంలో చేరిన విధంగా అన్ని మతాల గమ్యం భగవంతుడిని చేరుకోవడమేని అన్నారు. దీని కోసం ఎవరూ మతం మార్చుకోవాల్సిన అవసరం లేదని, తమ మతం మాత్రమే గొప్పదని భావించే వారు బావిలో కప్పల లాంటి వారని వ్యాఖ్యానించారు. ఆ అద్భుత ప్రసంగం శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో స్వామిజీ గొప్పదనమే కాదు, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు తెలిసి వచ్చింది. ఫోటోతో పాటు స్వామి వివేకానంద -ది సైక్లోనిక్ మాంక్ ఆఫ్ ఇండియా అని పోస్టర్స్ ముద్రించి చికాగో నగరంలో వేలాడదీశారు. ఇది జరిగి నేటికి 129ఏళ్లు పూర్తయింది.

## ఉప్పాడకు నిర్మాణం నిధుల కొరత,

రాజమండ్రి, సెప్టెంబర్ 10, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలోని అమినాబాద్ తీరంలో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ఐదు నెలలుగా నిలిచిపోయాయి. నిధుల విడుదలలో తీవ్ర జాప్యం, భూసేకరణ పూర్తి కాకపోవడం ఇందుకు కారణమని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే తీర ప్రాంత మత్స్యకారుల చిరకాల వాంఛ ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కొత్తగా తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు, నాలుగు ఫిషింగ్ ల్యాండింగ్ కేంద్రాలు నిర్మించతలపెట్టింది. వీటిలో భాగంగా ఉప్పాడ సమీపంలో రూ.422 కోట్ల వ్యయంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి 2020 డిసెంబరులో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులను ఎపి మెరైన్‌న్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎంఐడిసి) పర్యవేక్షణలో ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండిస్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణాన్ని చేపట్టింది. గత 20 నెలల్లో రెండు శాతంలోపే పనులు జరిగాయి. మేజర్ హార్బర్‌ను 2,500 బోట్లు నిలిపి ఉంచేలా నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. బోట్లు నిలిపేలా ప్లాట్ ఫామ్, 40 టన్నుల సామర్థ్యం కలిగిన రెండు ఐస్ ప్లాంట్లు, 980 టన్నుల సామర్థ్యంగల గిడ్డంగులు, బోట్లు తయారీ, మరమ్మతుల యార్డు నిర్మించాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే 1.10 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు మత్స్య సంపద సేకరణకు వీలుంటుందని అధికారులు అంచనా వేశారు. సుమారు 50 వేల మంది మత్స్యకారులకు నేరుగా ప్రయోజనం కలగనుందని ప్రకటించారు. ఈ సౌకర్యాలు ఇప్పటి వరకు సమీపంలోని కాకినాడలోనే ఉన్నాయి. ఇక్కడ పోర్టు కార్యకలాపాల వల్ల ఫిషింగ్ బోట్లకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఉప్పాడ ఫిషింగ్ హార్బరు నిర్మాణం తలపెట్టారు. ఇప్పటివరకు సుమారు రూ.9 కోట్ల ఖర్చు చేశారు. రెండు శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పనులు నిలిచిపోయాయి. పిల్లర్ల కోసం సిద్ధం చేసి ఆరు బయట ఉంచిన ఐరన్, ఇనుప గడ్డర్లు తుప్పు పడుతున్నాయి. ఆఫ్‌షోర్‌లో పనుల కోసం గతంలో వేసిన గాంట్రా అప్రోచ్ వర్క్ కూలిపోయింది. మొత్తం 50 ఎకరాల భూమి అవసరం కాగా, ఇందులో 12 ఎకరాల భూమిని స్థానిక రైతుల నుంచి ఇంకా సేకరించాల్సి ఉంది. రైతులకు పరిహారం విషయాన్ని ఎటూ తేల్చలేదు. మరో ఐదారు నెలల వరకు పనులు మళ్లీ మొదలయ్యే అవకాశం లేవని చెప్తున్నారు.

# పోలవరం నిర్వాసితుల కోసం

కాకినాడ, సెప్టెంబర్ 10, గోదావరి ముంపు బారిన పడిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ కొనసాగుతోంది. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సిపిఎల్‌ఏ హామీ ఇచ్చారు. మూడు పేజీల ఈ లేఖలో ముంపు ప్రాంతాల్లో సిపిఎం బృందం జరిపిన పర్యటన సందర్భంగా వెలుగులోకి వచ్చిన పలు సమస్యలను వివరించారు. ముంపు గ్రామాల్లోని ప్రజలు రెండు మాసాలుగా వరదలతో అవస్థలు పడుతున్నారని, పనులు లేక, కుటుంబాలు గడవక కష్టాల్లో ఉన్నారని తెలిపారు. నెల రోజుల్లో రెండుసార్లు ఎనిమిది మండలాల్లో వందలాది గ్రామాలు పూర్తిగా నీట మునిగాయని, ప్రజలంతా ఇళ్లను, సామగ్రిని వదిలేసి కొండలపైనా, అడవుల్లోనా తలదాచుకున్నారని, నానా అవస్థలు పడ్డారని తెలిపారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే పని స్వల్పంగానే జరిగిందని వివరించారు. వెంటనే ప్రతి కుటుంబానికీ రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని, పడిపోయిన ఇళ్లకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ సంవత్సరం వ్యవసాయ సీజన్‌లో వరదల వల్ల వ్యవసాయం పూర్తిగా దెబ్బతిందని, పంటలు వేయలేదని, దీనివల్ల ఉపాధి తీవ్రమైన సమస్యగా మారిందని పేర్కొన్నారు. వెంటనే ఉపాధి చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్వాసిత కాలనీల్లో ఉపాధి చర్యలు ప్రత్యేకంగా చేపట్టాలని, అప్పటి వరకూ ప్రతి నెలా కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. 1986, 2022లో వచ్చిన వరదలు ప్రామాణికంగా తీసుకుని మొత్తం ముంపు గ్రామాల రీ సర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు. పునరావాసం సంపూర్ణంగా పూర్తయ్యే వరకూ ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని, ఇటీవల వరదల్లో మునిగిపోయిన పునరావాస కాలనీలకు కూడా ప్రత్యామ్నాయంగా ముంపు లేనిచోట తిరిగి కాలనీలు నిర్మించాలని కోరారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం 25 రకాల మౌలిక సదుపాయాలతో పునరావాస కాలనీలు నిర్మించాలన్నారు. పునరావాస కాలనీల నిర్మాణం పూర్తయ్యి ముంపు గ్రామం అక్కడికి తరలించేనాటికి 18 ఏళ్లు వయసు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, పాత కటాఫ్ తేదీలు రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలు వెంటనే ఇవ్వాలని, భూమికి భూమి ఇచ్చే ప్రాంతం వ్యవసాయ యోగ్యమైనదిగా, వివాదాలు లేనిదై ఉండాలని సూచించారు. మునిగిపోయే భూమికి ఎకరాకు రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని, గతంలో ఎకరాకు రూ.లక్షా 15 వేలు పరిహారమిచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.5 లక్షలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ముంపు ప్రాంతంలో చదువుకున్న యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కోసం స్థానికంగా సంస్థలు ఏర్పాటు చేయాలని, ప్రాజెక్టులోనూ, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. తక్షణం మునిగిపోతున్న గ్రామాల్లో స్కూల్స్, అంగన్వాడీ సెంటర్స్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.ముంపు బాధితులను రక్షిత ప్రాంతాలకు తరలించడానికి స్వల్పంగానే కృషి చేశారని, దీంతో బాధితులు కొండలపైనా, అడవుల్లో తలదాచుకున్నారని తెలిపారు. పునరావాస శిబిరాల్లోనూ కనీస అవసరాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. వరద సమయంలో 200 ఎంఎల్ కిరోసిన్ మాత్రమే ఇచ్చారని, రేషన్ కార్డు ఉన్న వారికి ఒక గంటకు సరిపోయే కొవ్వొత్తి, రోజుకొక మంచినీళ్ల ప్యాకెట్ ఇచ్చారని తెలిపారు. అడవిలో కర్రలు తెచ్చుకుని తాత్కాలికంగా గుడిసెలు వేసుకోవడానికి ప్రయత్నించిన వారిపై కేసులు పెడతామని అటవీశాఖ అధికారులు బెదిరించారని పేర్కొన్నారు. వేలాది మంది విష జ్వరాల బారిన పడ్డారని, పలువురు మరణిస్తున్నారని తెలిపారు. ఒక్క కుయిగూరులోనే డెంగ్యూతో ఐదుగురు చనిపోయారని తెలిపారు. చింతూరు ఆస్పత్రిలో ఒకే డాక్టర్ ఉండటంతో కేసులన్నింటిని రాజమండ్రికి రిఫర్ చేస్తున్నారని, దీంతో గత్యంతరం లేక భద్రాచలం వెళ్తున్నారని అక్కడ వైద్యం అందడం లేదని తెలిపారు. పునరావాసం పూర్తి చేయకుండా కాఫర్ డ్యామ్ నిర్మాణం చేయడం వల్ల భారీ నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన ముంపు లెక్కలకు, వాస్తవ ముంపునకు పొంతన లేదని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలను అధికారులకు అందచేశారు. పునరావాసం ఐదు శాతమే పూర్తయిందని, అది కూడా 41.15 కాంటూరు పరిధిలోనిదేనని వివరించారు. మిగిలిన వారిని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని పేర్కొన్నారు.

# న్యూయార్క్ 9/11 దాడులకు 21ఏళ్లు...!

అమెరికా న్యూయార్క్ నగరంలో ఉన్న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై అల్‌ఖైదా ఉగ్రవాదులు దాడులకు దిగారు. నాలుగు విమానాలను హైజెక్ చేసి ట్విన్ టవర్స్‌ను కూల్చేశారు. 2001 సెప్టెంబరు 11వ తేదీన జరిగిన దాడులతో న్యూయార్క్ నగరం చిగురటాకులా వణికిపోయింది. సెప్టెంబర్ 11... ఈరోజును ప్రపంచమంతా గుర్తుచేసుకుంటుంది. ఎందుకంటే ఇదేరోజున అమెరికా వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి జరిగింది. దీంతో ప్రపంచ ప్రజలు ఉలిక్కిపడ్డారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి చేసిన ఉగ్రవాదులు మారణహోమం సృష్టించారు. ఈ దుర్ఘటన జరిగి 17 ఏళ్లు గడిచినా.. నేటికి అమెరికన్లే కాదు... ప్రపంచ ప్రజలు కూడా ఈ దుర్ఘటనను మరిచిపోలేరు. అల్‌ఖైదా ఉగ్రమూక విమానదాడులు జరిపి దాదాపు మూడువేల మందిని పొట్టన పెట్టుకున్నారు.అమెరికా న్యూయార్క్ నగరంలో ఉన్న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై అల్‌ఖైదా ఉగ్రవాదులు దాడులకు దిగారు. నాలుగు విమానాలను హైజెక్ చేసి ట్విన్ టవర్స్‌ను కూల్చేశారు. 2001 సెప్టెంబరు 11వ తేదీన జరిగిన దాడులతో న్యూయార్క్ నగరం చిగురటాకులా వణికిపోయింది. ఉగ్రదాడితో వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ ట్విన్ టవర్స్ నేలకూలాయి. ఈ దాడుల్లో సుమారు మూడువేల మంది చనిపోగా... మరో ఆరువేల మంది గాయాలపాలయ్యారు. 9/11దాడులతో మనదేశ వాణిజ్య రాజధాని ముంబై సహా అనేక దేశాల్లో పలు కీలక నగరాల్ని అమెరికా విదేశాంగ శాఖ అప్రమత్తం చేసింది. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, అణుకేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.అమెరికా న్యూయార్క్ నగరంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్లపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నేటితో 21ఏళ్లు పూర్తయ్యాయి. అందుకే సెప్టెంబర్ 11 అంటే చాలు అమెరికన్లు ఉలిక్కిపడుతుంటారు. అల్‌ఖైదా ఉగ్రవాదులు స?ష్టించిన ఈ భీకర విధ్వంసం నుంచి తేరుకోవడానికి అమెరికాకు చాలా ఏళ్లే పట్టింది. అనంతరం ఉగ్రమూకల ఏరివేత చర్యల్లో భాగంగా అమెరికా తమ బలగాల్ని ఆఫ్ఘాన్‌లో మోహరించి ..సరిగ్గా న్యూయార్క్ దాడులు జరిగిన పదేళ్లకు అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్‌ను తుదముట్టించింది.

# సమస్యకు పరిష్కారం వెతకాలి

### వీసీ ఆచార్య సూర్యకళావతి

కడప పిల్లల్లో అంతర్గత నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. తల్లిదండ్రులు ఆకాంక్షలను పిల్లల్లో తీర్చుకునే నేపథ్యంలో బాల బాలికలపై ఒత్తిడి పెరుగుతోంది. లక్ష్యాలను చేరుకోలేక సున్నితమైన మనస్కులు కొందరు ఆత్మహత్యల వైపు వెళుతున్నారని అది సరైన విధానం కాదని యోగివేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య మునగల సూర్య కళావతిఅన్నారుఆవిశ్వవిద్యాలయం మనోవిజ్ఞాన శాస్త్ర శాఖ ఆధ్వర్యంలో "వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే "సందర్భంగా చైతన్య కార్యక్రమం సైన్స్ బ్లాక్ లోని సెమినార్ హాల్లో కన్వీనర్ డా.లాజర్ అధ్యక్షత న జరిగింది.ఇందులో ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య మునగల సూర్య కళావతి మాట్లాడుతూ మా బాల్యం సంతోషకరంగా సాగిందని, ప్రస్తుతం 5వతరగతి నుంచే ఐఐటీల చదువుల వైపు పరుగులెత్తడం బాధాకరమన్నారు. ప్రస్తుతం విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. ఆత్మహత్య చేసుకుంటే చేసుకున్న వ్యక్తి ఉన్న సమస్య నుంచి బయట పడతాడేమో కాని ఆ సమస్యను కుటుంబ సభ్యులందరికీ ఇచ్చి బాధపడేలా చేస్తారన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదనిస్పష్టంచేశారు.ప్రధానాచార్యులకే కృష్ణారెడ్డి మాట్లాడుతూ కలల్లో తేలియాడుతూ లక్ష్యాలను సాధించేందుకు ఎవరైతే శ్రమించరో వారు ఆత్మహత్య ఆలోచనలు చేస్తూ ఉంటారన్నారు. సమాజంలో తల్లిదండ్రులు వారి గౌరవం కోసం, గుర్తింపు కోసం టాప్ ర్యాంకులో ఉండాలని కోరుతుండడం జరుగుతోందన్నారు. ఏవైనా పరీక్షల ఫలితాలు వచ్చినప్పుడు చావు వార్తలు పత్రికల్లో కనిపిస్తాయని అవి చూసినప్పుడు ఆవేదన కలుగుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్ ఫోన్ అతిగా వినియోగించ వద్దని , సామాజిక మాధ్యమాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. వై వి యూ పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి పద్మ మాట్లాడుతూ జీవితమంటే అన్నీ విజయాలే ఉండవన్నారు. ఏది జరిగినా మన మంచికే అన్న ఆలోచన ప్రతి ఒక్కరు చేయాలని సూచించారు. ఆత్మవిశ్వాసాన్ని సడలనివ్వకూడదని తెలిపారు. మనో విజ్ఞాన శాస్త్ర విభాగ అధిపతి డా.వి. లాజర్ మాట్లాడుతూ జీవితం ఆనందమయంగా సాగేలా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరి పుట్టుక వెనుక ఏదో ఒక ప్రయోజనం ఉంటుందని, ఎలాంటి ఆటంకాలు ఎదురైనా మీరు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మనోవిజ్ఞాన శాస్త్ర శాఖ సహ ఆచార్యులు, సదస్సు కో కన్వీనర్ డాక్టర్ కె. లలిత మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సైకాలజీ శాఖ అధ్యాపకులు డాక్టర్ మైలాపురం లక్ష్మీ నరసింహ, డాక్టర్ బి. రవి విలువైన సూచనలు చేశారు. యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం" సైకాలజీ సీనియర్ విద్యార్థులు పవిత్ర, అనీఫా, మల్లికార్జున, సజిత ప్రదర్శించగా,"చదువుల ఒత్తిడి నాటకాన్ని" సైకాలజీ జూనియర్ విద్యార్థులు ఆనంద్, పల్లవి, వెంకటసుబ్బయ్య, ప్రియాంక, జవహర్ రెడ్డి ప్రదర్శించారు. ప్రస్తుతం సమాజ పరిస్థితులకు ఈ నాటకాలు అద్దం పట్టాయి. కార్యక్రమంలో సహ ఆచార్యులు డా.సునీత, డా.సరిత, డా.దాక్షాయణి, డా.మునికుమారి , పరిశోధకులు , అధ్యాపకులు పాల్గొన్నారు

## అసోం సీఎంను రానీయకుండా చేయాలి

హైదరాబాద్ అస్సాం సీఎంని తీసుకొచ్చి ఇక్కడ ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని బిజెపి చూసిందని అధికార ప్రతినిధి సుధీర్ రెడ్డి ఆరోపించారు. హేమంత్ బిశ్వ శర్మ ఇక్కడికి వచ్చినప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయలేదు. రాష్ట్రానికి హేమత బిశ్వ శర్మ రాకుండా కట్టడి చేయాలని అన్నారు.ఒక కేంద్రమంత్రి రాష్ట్రానికి వచ్చి నరేంద్ర మోడీ బొమ్మ పెట్టలేదని అనడం కరెక్టా. ఈ సమాజాన్ని విభజించి గొడవలు పెట్టాలని ఈ రెండు పార్టీలు చూస్తున్నాయి .. ప్రజల్లో వైశామ్యాలన్ని తీసేయాలని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రను చేపట్టారు. రాహుల్ గాంధీ వేసుకున్న టీ షర్ట్ పై బిజెపి నేతలు విజ్ఞత లేకుండా మాట్లాడుతున్నారు. బిజెపి గాడ్సే సిద్ధాంతాన్ని నమ్ముతుంది .. కాంగ్రెస్ గాంధీని దేవుడుగా పూజిస్తుంది. ఏ పార్టీ అయినా భారత జోడో యాత్రను విమర్శిస్తే మీరే చిన్న వాల్లు అవుతారు. రాజగోపాల్ రెడ్డి అమ్ముడు పోయే వ్యక్తి.. మీరు వెళ్లిపోయినందుకు మేము సంతోషంగా ఉన్నామని అన్నారు.రాజగోపాల్ రెడ్డికి మునుగోడులో శాశ్వతమైన శిలాఫలకం వెయ్యబోతున్నాం. రాజగోపాల్ రెడ్డి ని ఎప్పుడు కూడా ప్రజలు రెండోసారి గెలవనివ్వలేదు. రాజు గోపాల్ రెడ్డి కి రెండవసారి గెలిచిన చరిత్ర లేదని అన్నారు.అధికార ప్రతినిధి కల్వ సుజాత మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ లేకపోతే ప్రజాస్వామ్యం సచ్చిపోతుంది అని ప్రజలు గమనిస్తున్నారు. దేశం కోసం ఆస్తులు ప్రాణాలను త్యాగం చేసిన కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి రాహుల్ గాంధీ. మోడీ 10 లక్షల సూట్ వేస్తే మీకు నష్టం లేదు.. రాహుల్ గాంధీ 40 వేల టీ షర్ట్ వేస్తే మీకేంటి.

## ప్రశాంతంగా కాకినాడ కార్పొరేషన్ భేటీ

కాకినాడకాకినాడ కార్పొరేషన్ పాత కార్యాలయంలోని కౌన్సిల్ మందిరంలో చివరి పాలకవర్గ సమావేశం ప్రశాంతంగా సాగింది. ఉదయం 11 గంటలకు స్థానిక సూర్యకళామందిరంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కలెక్టర్ కృతికాశుక్లా, సంయుక్త కలెక్టర్ ఇలక్కియ, మున్సిపల్ కమిషనర్ రమేశ్, కార్పొరేషన్ అధికారులతో ఫొటో సెషన్ నిర్వహించారు. అనంతరం మేయర్ సుంకర శివప్రసన్న, కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులతో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరానికి వచ్చారు. వ్యక్తిగత కారణాలతో మేయర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉప మేయర్-1 మిసాల ఉదయ్కుమార్ మేయర్ స్థానంలో ఉండి అజెండాలోని రెండు అంశాలను ఆమోదించారు. 20 నిమిషాల తరువాత వ్యక్తిగత పని ఉందని వెళ్లిపోయారు. ఉప మేయర్-2 చోడిపల్లి వెంకటసత్యప్రసాద్ సమక్షంలో కొన్ని అంశాలను ఆమోదించారు. ఆ తర్వాత మేయర్ శివప్రసన్న సభలోకి వచ్చారు. మధ్యాహ్నం 12.54 నుంచి 2.30 గంటల వరకు మేయర్ సభను నిర్వహించారు. అజెండాలో పొందుపర్చిన 40 అంశాలపై అరకొరగా చర్చ జరిపి ఆమోదించారు.ఏకంగా 40 అంశాలను కౌన్సిల్ చివరి సమావేశం ముందు ఉంచారు. వీటిలో సుమారుగా 20 కోట్ల మేర అభివృద్ధి పనులే ఉన్నాయి. కాకినాడ గ్రామీణ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే డివిజన్లలో ఇన్నాళ్లకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సురేశ్నగర్ పార్కులో నిర్మిస్తున్న కన్వర్టబుల్ స్టేడియంకు సీఎం జగన్మోహన్రెడ్డి పేరు పెట్టాలని ఎమ్మెల్యే కన్నబాబు ప్రతిపాదించగా, సభ ఆమోదించింది. ఆఖరిలో కార్పొరేటర్లు తమ డివిజన్లలోని రహదారులు, భవనాలు, ఇతర ఆస్తులకు పలు పేర్లు ప్రతిపాదించి, ఆమోదించుకున్నారు. ముంపుబారిన పడుతున్న ఎంఎస్ఎన్ ఛారిటీస్ విద్యాసంస్థకు ఎమ్మెల్యే, ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్కు పంపినట్లు చెప్పారు. 48 మంది కార్పొరేటర్లకు ఇద్దరు మినహా అందరూ హాజరయ్యారు.సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి కాకినాడ కౌన్సిల్లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చారని ఎంపీ గీత, ఎమ్మెల్యేలు కన్నబాబు, చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. రెల్లి సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్ ఉదయ్కుమార్, మత్స్యకార వర్గానికి చెందిన సత్యప్రసాద్కు ఉప మేయర్లు ఇచ్చి ఆ సామాజిక వర్గాలను గౌరవించారని కొనియాడారు. కాకినాడకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని పాలకవర్గ సభ్యులు, అధికారులను వారు అభినందించారు.కాకినాడ నగరపాలక సంస్థ పాలకవర్గం పదవీ కాలం ఈ నెల 15తో ముగియనుంది. 16 నుంచి ప్రత్యేక అధికారి పాలనలోకి వెళ్లనుంది. నగరపాలక సంస్థగా రూపాంతరం చెందాక 2010-2017 మధ్యకాలంలో ఏడేళ్లపాటు ప్రత్యేక అధికారి పాలన సాగింది. ప్రస్తుతం ఎన్నికలు లేకపోవడంతో ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పగించనున్నారు. కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఇద్దరిలో ఒకరిని నియమించే అవకాశం ఉంది.

# ఆత్మహత్యలను నివారిద్దాం....



జిల్లా ఎస్పీ శ్రీ సిద్ధార్థ్ కౌశల్ ఐపియస్



,కర్నూలు క్రైమ్ ఆత్మహత్యల నివారణ కు జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించిన... జిల్లా ఎస్పీ. ప్రజల్లో అవగాహన కల్పించడానికే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం.సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు. సెప్టెంబర్ 10 న 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో భాగంగా పోలీసు శాఖ , ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మహత్యలు ఎవరూ చేసుకోరాదని, నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అక్కడ పాల్గొన్న అందరిచే ప్రతిజ్ఞ చేయించారు.అపోహలు, వాస్తవాల పై అవగాహన కల్పించే కరపత్రాన్ని, దిగులు, బాధ, ఒత్తిడి, ఆందోళనలతో తనువు చాలించాలనుకునే వారిని ఆ కుటుంబం, స్నేహితులు, ప్రభుత్వం, పోలీసులు, వైద్యులు ఆదుకుందామనే తెలియజెప్పే పోస్టర్లను ఓపెన్ చేసి ప్రదర్శించారు.ఆత్మహత్యల నివారణ గురించి వ్యాస రచనలలో గెలుపొందిన వారికి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ గారు జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి ప్రారంభమై గవర్నమెంట్ హాస్పిటల్ , బుధవార పేట మీదుగా రాజ్ విహార్ వరకు కొనసాగింది.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ గారు మాట్లాడారు. నమ్మకం, ఆశ, ధైర్యం కల్పించి సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. సమాజంలో నేర నివారణకు పోలీసులు నిఘా ఉంచారన్నారు. కుటుంబకలహాలు, ఇతర కారణాలతో పోలీసుస్టేషన్ లకు వచ్చే వారిని ఫ్యామిలి కౌన్సిలింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి దశలో ఏవరైనా ఒత్తిడి కి గురై బాధపడుతూ ఉంటే వారిని గుర్తించి సమస్యల ఒత్తిడి నుండీ ఉపశమనం పొందేందుకు డాక్టర్లు, మానసిక వైద్య నిపుణులు, సర్వీస్ ప్రోవైడర్స్ అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ మహిళా పోలీసులు గ్రామాలలో , పట్టణాలకు వెళ్ళినప్పుడు మహిళల సమస్యలను గుర్తించి మాట్లాడి అవగాహన చేయాలన్నారు. ఐఎంఎ కర్నూలు ప్రెసిడెంట్ డాక్టర్ రమేష్ గారు మాట్లాడుతూ...ఆర్థిక , సామాజిక కుటుంబ కారణాలతో , విద్యార్దులు లక్ష్యాన్ని చేధించే సమయంలో నిరాశకు గురైనప్పుడు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని వాటిని నివారించాలన్నారు " అఖీఇయఎఔఉ ఉూఖఇ౹ఉఃఖీూజఉఉః ంఅుమొాఔ " 2022 ఆత్మహత్యల నివారణ దినోత్సం థీమ్ (ఇతి వృత్తం) అని , ఆత్మహత్యల నివారణకు ఒక హెల్ప్ లైన్ ఏర్పాటు చేస్తే బాగుంటందన్నారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ. వెంకట రంగారెడ్డి గారు మాట్లాడుతూ...వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడితే వ్యక్తిగతంగా ప్రాణాలు పోగొట్టుకోవడంతో పాటు ఆ కుటుంబాలు ఎలా చిన్నాభిన్నమవుతాయో సవివరంగా అవగాహన చేశారు.బలవన్మరణాలకు వెళ్లకుండా పరిస్థితులను ఎలా అధిగమించాలి, కష్టాలు ఇబ్బందులు ఎదురైనప్పుడు మానసికంగా ఎలా దృఢంగా ఉండాలి, తదితర అంశాలపై తెలియజేశారు.కర్నూలు మానసిక వైద్య నిపుణులు రమేష్ బాబు గారు మాట్లాడుతూ...ప్రతి సం. 10 వేల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. రోజుకు 450 ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. ఆత్మహత్యలను నివారించేందుకు అందరూ కంకణం కట్టుకోవాలన్నారు. దినపత్రికలలో ఆత్మహత్యల గురించి రాసేటప్పుడు పెద్దగా రాయకూడదన్నారు. ఆవిధంగా ఎవరు పాల్పడకుండా అవగాహన చేస్తూ చిన్నగా రాయలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎఓం ప్రెసిడెంట్ డాక్టర్ రమేష్ , కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ. వెంకట రంగారెడ్డి , కర్నూలు మానసిక వైద్య నిపుణులు రమేష్ బాబు, అడిషనల్ ఎస్పీ నాగబాబు, డిఎస్పీలు వెంకటాద్రి, యుగంధర్ బాబు, కెవి మహేష్ , పోలీసు వేల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి గారు , సిఐలు తబ్రేజ్, శ్రీనివాసులు రెడ్డి , శంకర్య, తిమ్మారెడ్డి ఆర్ ఐలు , డాక్టర్లు, మహిళా పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు, మెడికల్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లల్లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించాలి.

## సిఐటియు డిమాండ్.



కర్నూలు :ఇళ్లల్లో పనిచేసే ఇంటి పని వారిని కార్మికులుగా గుర్తించికార్మికులకు వర్తించే అన్ని సౌకర్యాలు కల్పించాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.డి.అంజి బాబు,సిఐటియు ఆటో యూనియన్ న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి. రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం నగరంలోని 19,20వ వార్డులలోని ఇండ్లలో పని చేసే వారి సంఘం విస్తృత సమావేశం సీఐటీయు కార్యాలయంలో మహిళా సంఘం నాయకురాలు రత్నమ్మ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఇండ్లలో పని చేసేవారు అత్యంత దౌర్భాగ్యమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అన్నారు.ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని,పిల్లల చదువుకు ప్రభుత్వం సహాయం అందించాలని, పెళ్లిళ్లకు సహాయం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కర్ణాటకలో ఇండ్లలో పని చేసే వారికి సిఐటియు చేసిన ఆందోళన ఫలితముగా రూ.2వేలు పెన్షన్ ఇచ్చారని తెలిపారు. అనంతరం ఆటో యూనియన్ న్యూ సిటీ కార్యదర్శి బి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఇండ్లలో పనిచేసే వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇంటి వారుల సంఘం నాయకత్వం ఐక్య మత్యంతో పోరాడి సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు.అనంతరం 19,20వ వార్డుల కమిటీ 17 మందితో ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్ష కార్యదర్శులుగా పుష్పావతమ్మ,అరుంధతి నగర్,సుగుణమ్మ. మజుందానగర్ ఉపాధ్యక్షులుగా లక్ష్మీదేవి, లత,లలితమ్మ,ఆర్. సునిత,సుశీల,ఎం లక్ష్మీదేవి,జి.లక్ష్మి,సహాయ కార్యదర్శులుగా. లక్ష్మీదేవి,చిలకమ్మా.బి. విజయ,ఎన్.పద్మ,జి.లక్ష్మి, ఆర్.మేరీ,మార్తమ్మ, మహేశ్వరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో సిఐటియు నాయకులు మాలిక్ భాష, మహిళా సంఘం నాయకులు రుద్రమ్మ,బిబీ, సీతమ్మ,పార్టీ సభ్యులు సురేష్,అశోక్,జయన్న, పాల్గొన్నారు.

# సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ



## విద్యుత్ పోరాటంలో అమరుడు సత్తెనపల్లె రామకృష్ణ ఆశయాలను కొనసాగిద్దాం
## ఏపీ రజక వృత్తి దారుల సంఘం

,కర్నూలు :ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం, కర్నూల్ నగర కమిటీల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ-సత్తనపల్లె రామకృష్ణల వర్ధంతి సభ శనివారం స్థానిక కార్మిక, కర్షక భవనంలో కర్నూల్ ఓల్డ్ సిటీ అధ్యక్షురాలు సి. జయమ్మ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముందుగా ఐలమ్మ, రామక్రిష్ణల చిత్ర పఠాలకు వృత్తిదారుల సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చేతి వృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడు జి.రామకృష్ణ, రజక వృత్తిదారుల సంఘం కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి,ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.హెచ్. శ్రీనివాసులు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ రజక వృత్తిదారుల కుటుంబంలో జన్మించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరనారిగా నిలిచింది.అనేకమంది పేద ప్రజల భూములను లాక్కోవడానికి ప్రయత్నించిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపించిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు.చదువు లేకున్న వారి కుటుంబాన్ని నిజాం నవాబులు అనేక చిత్రహింసలకు గురిచేసిన వెనకడుగు వేయలేదన్నారు.పండించుకున్న పంటలను కాపాడుకోవడానికి పేద ప్రజలందరినీ సమీకరించి ఆనాడు ఉన్న పెత్తందారులు నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాటాలు నడిపిన చరిత్ర చాకలి ఐలమ్మదిఅని అన్నారు.2000 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా హైదరాబాదులోని బషీర్ బాగ్ నందు జరిగిన విద్యుత్ ఉద్యమంలోముందు వరుసలో ఉండి బుల్లెట్ గాయాలకు నేలకొరిగిన ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఉమ్మడి రాష్ట్ర కన్వీనర్ సత్తెనపల్లె రామకృష్ణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కారం కొరకు అనేక జిల్లాల్లో పర్యటించి వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు. ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిన చరిత్ర సత్తెనపల్లె రామకృష్ణది అన్నారు.కావున వారి ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం రజక వృత్తిదారులు,రజక ఉద్యోగులు,రజక మేధావులపై ఉందని చెప్పారు.అదేవిధంగా ఐలమ్మ,రామకృష్ణ వర్ధంతి సభ సందర్భంగా రేపు ఆదోనిలో జరుగు సదస్సును జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రమణ, కర్నూలు న్యూ సిటీ అధ్యక్షుడు సి.రాముడు నగర నాయకులు పుష్ప, మద్దిలేటి,కిషోర్, లక్ష్మన్న,తదితరులు పాల్గొన్నారు.

# సక్సెస్ కోసం హారర్ కామెడీని నమ్ముకున్న మంచు విష్ణు..!



మంచు విష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ "జిన్నా". ఆయన స్వీయ నిర్మాణంలో రూపొందుతున్న ఈ సినిమాకి ఇషాన్ సూర్య దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విష్ణు సరసన హాట్ భామలు పాయల్ రాజ్ పుత్ మరియు సన్నీ లియోన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.'జిన్నా' చిత్రాన్ని తెలుగు మలయాళ హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ గ్లిమ్స్ ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర బృందం హైదరాబాద్ ఏఎంబీ సినిమాస్ లో నిర్వహించిన కార్యక్రమంలో టీజర్ ను లాంచ్ చేశారు.ఇందులో జిన్నా టెంట్ హౌజ్ ఓనర్ గా మంచు విష్ణు కనిపించాడు. జిన్నా టైంకు రావడంతో పాటు బ్యాడ్ టైంను కూడా తీసుకొస్తాడు అంటూ విష్ణు క్యారెక్టర్ ను పరిచయం చేశారు. ఊరంత అప్పులు చేసిన పనికిమాలిన వాడిగా అతని గురించి పేర్కొన్నారు.అప్పుల బాధ నుంచి బయట పడేయడానికి సాక్షాత్తూ లక్ష్మీ దేవి రావాలని అనుకుంటుండగా.. విష్ణు లైఫ్ లోకి ఎన్నారై సన్నీలియోన్ ఎంట్రీ ఇస్తుంది. ఆమె రాకతో జిన్నా టైం స్టార్ట్ అయిందని అనుకుంటుండగా.. కథలో ట్విస్ట్ ని చూపించారు.సన్నీలియోన్ శరీరంలోకి ఓ ఆత్మ ప్రవేశించినట్లు టీజర్ చూస్తే తెలుస్తుంది. నన్ను చంపేస్తావా బాబాయ్ అంటున్న ఆ దెయ్యం వెనుక కథ ఏంటి? దాని బారి నుండి హీరోయిన్ ని విష్ణు ఎలా కాపాడాడు? అనేది తెలియాలంటే 'జిన్నా' సినిమా చూడాల్సిందే.ఇందులో జిన్నా ప్రేయసిగా పచ్చళ్ల స్వాతిగా పాయల్ రాజ్ పుత్ కనిపించింది. నరేష్ - సునీల్ - వెన్నెల కిశోర్ - రఘుబాబు - చమ్మక్ చంద్ర తదితరులు ఇతర పాత్రల్లో కనిపించారు. విష్ణు తొలిసారిగా డిఫరెంట్ స్లాంగ్ లో డైలాగ్స్ చెప్పే ప్రయత్నం చేశారుకొంతకాలంగా వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న విష్ణు.. హిట్ కోసం ఈసారి రొమాంటిక్ హారర్ కామెడీని నమ్ముకున్నట్లు అర్థమవుతోంది. ఇందులో యాక్షన్ కు కూడా ప్రాధాన్యత ఉన్నట్లు హింట్ ఇచ్చారు. గతంలో ఇలాంటి జోనర్స్ ని డీల్ చేసిన ప్రముఖ రచయిత కోన వెంకట్ కథ - స్క్రీన్ ప్లే అందించడవే కాకుండా క్రియేటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు.అనూప్ రూబెన్స్ సమకూర్చిన బ్యాగ్రౌండ్ స్కోర్ మరియు సినిమాటోగ్రాఫర్ చోటా కె నాయుడు విజువల్స్ దీనికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఓవరాల్ గా 'జిన్నా' టీజర్ సినిమాపై ఆసక్తిని కలిగించేలా ఉందని చెప్పాలి.మంచు అవ్రమ్ భక్త సమర్పణలో ఏవీఏ ఎంటర్టైన్మెంట్స్ మరియు 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్స్ పై మంచు మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభుదేవా - గణేష్ ఆచార్య - ప్రేమ్ రక్షిత్ వంటి పాపులర్ డ్యాన్స్ మాస్టర్స్ ఈ సినిమాలో పాటలకు కొరియోగ్రఫీ చేశారు.'జిన్నా' చిత్రాన్ని అక్టోబర్ నెలలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. త్వరలోనే రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేసే అవకాశం ఉంది. 'మోసగాళ్ళు' వంటి డిజాస్టర్ తర్వాత మంచు విష్ణు నటించిన ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.







# వీటికి బదులేది.. జట్టు కూర్పుపై కొత్త ప్రశ్నలు



టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి ఇంకా నెల రోజులే ఉంది.. ఆ లోపు టీమ్ ఇండియా మరో 6 మ్యాచ్‌లే ఆడనుంది. ఈ పాటికే మెగాటోర్నీ జట్టుపై ఓ అంచనాకు రావాల్సి ఉండగా.. రోహిత్ సేన మాత్రం కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నది! ఆరు జట్లు మాత్రమే పాల్గొన్న ఆసియాకప్‌లో ఫైనల్‌కు చేరలేకపోయిన భారత్.. ఐసీసీ టోర్నీలో ఏం చేస్తుందో అనే సందేహాలు తలెత్తుతున్నాయి!ధాటిగా ఆడాల్సిన పొట్టి ఫార్మాట్‌లో కేఎల్ రాహుల్ వికెట్ కాపాడుకోవడానికి ప్రాధాన్యమివ్వడం!! వరుసగా రెండు మ్యాచ్‌ల్లో 19వ ఓవర్ వేసిన భువనేశ్వర్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోవడం!! దినేశ్ కార్తీక్‌ను కాదని తుది జట్టులో చోటు దక్కించుకున్న పంత్ పేలవ షాట్లతో పెవిలియన్ చేరడం!! ఒక మ్యాచ్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చిన రవి బిష్ణోయ్‌కు తదుపరి మ్యాచ్‌లో అవకాశం ఇలా జవాబు లేని ప్రశ్నలెన్నో రాహుల్ ద్రవిడ్‌ను వేధిస్తున్నాయి.డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన టీమ్‌ఇండియా ఆసియాకప్‌లో ఫైనల్ చేరకుండానే ఇంటి బాటపట్టింది. గ్రూప్ దశలో రాణించిన రోహిత్ సేన.. సూపర్-4 తొలి రెండు మ్యాచ్‌ల్లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. పాకిస్థాన్‌తో పోరులో ఒత్తిడికి చిత్తైన భారత్.. శ్రీలంకతో మ్యాచ్‌లో అన్ని రంగాల్లో విఫలమైంది. ఇక చివరి పోరులో అఫ్గానిస్థాన్‌పై ఓదార్పు విజయం సాధించినా.. మేనేజ్‌మెంట్ ఆలోచనా ధోరణిపై సవాలక్ష ప్రశ్నలు లేస్తున్నాయి. ఎంత నామమాత్ర పోరైనా.. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో చివరి ఓవర్ దినేశ్ కార్తీక్‌తో బౌలింగ్ చేయించడం అభిమానులను సైతం ఆశ్చర్యపరిచింది. అర్ష్‌దీప్ ఓవర్లు మిగిలే ఉన్నా.. ఇంతవరకు కెరీర్‌లో ఒక్కసారి కూడా బౌలింగ్ చేయని వ్యక్తితో ఆఖరి ఓవర్ వేయించడం టీమ్‌ఇండియాకే చెల్లింది. ఓ సెంచరీ, రెండు అర్ధశతకాలతో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తిరిగి ఫామ్ అందుకోవడం తప్ప భారత్‌కు ఈ టోర్నీ పెద్దగా ఒరిగిందేమి లేదు. స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా గాయపడి టీ20 ప్రపంచకప్‌నకు కూడా దూరం కాగా.. రిషబ్ పంత్‌లో ఆత్మవిశ్వాస లోపం తేటతెల్లమైంది.జట్టు కూర్పుపై 95 శాతం స్పష్టత వచ్చిందని కెప్టెన్ రోహిత్ శర్మ పేర్కొనగా.. నాలుగో స్థానంలో ఎవరు బరిలోకి దిగుతారో ఇంకా తేలలేదు. ఒక్కో మ్యాచ్‌లో ఒక్కో ఆటగాడిని పరీక్షించారు. దీపక్ హుడా, దినేశ్ కార్తీక్, రవిచంద్రన్ అశ్విన్, రవి బిష్ణోయ్‌కు అవకాశాలు ఇచ్చినా.. వారికి జట్టులో చోటుపై భరోసా మాత్రం ఇవ్వలేకపోయారు. ఇక బౌలింగ్‌లో కీలకమైన రెండు మ్యాచ్‌ల్లో పేలవ ప్రదర్శన చేసిన భువనేశ్వర్ కుమార్.. అఫ్గాన్‌తో పోరులో ఐదు వికెట్లు పడగొట్టాడు. అవేశ్ ధారాళంగా పరుగులిచ్చుకోగా.. అర్ష్‌దీప్ ఉన్నంతలో ఫర్వాలేదనిపించాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190